# ఆకాశచిత్రాలు

శ్రీ జి. భాను

పరిహాసంగా నవ్వుతున్న చుక్కల పరువాన్ని అంతం చేయడానికి కారుమబ్బులు తొందరపడుతున్నాయి.

చీకటిస్నానంచేసి ఎత్తులో జుట్టు విరియబోసుకొంటున్న పిశాచిస్త్రీలలావున్న ఈతచెట్ల అవతారపు కదలికను గమనించిన గాలి అసూయపడి స్తంభించింది.

దేవాలయం శిఖరం దాపునుండి కన్నుగీటిన చుక్క ధైర్యానికి ఏటిలోని అల ఒళ్ళు విరచుకొన్నది బాధగా.

తల్లి స్తనచూచుకాన్ని అంటిపెట్టుకొన్న పసిపాపలాగా పర్వతాగ్రాన్ని మబ్బుతునక స్పృశించివుంది.

కాంతియుగంలో మూగపోయిన గొంతులు చీకటియుగంలో కంఠనాళాలు సరిచేసుకొన్నట్లు రక రకాల జీవులు ఆక్రోశిస్తున్నాయి.

నిశ్శబ్దం రాజ్యం ఏలుతున్నది; నిశీథిని పహరా కాస్తున్నది; ప్రపంచం నిద్రపోతున్నది.

అంతఃపుర కారాగారంలో మగ్గిపోతూ అప్పుడప్పుడు పరదాల కిటికీలలోనుండి క్షణంచూసే అసూర్యంపశ్యలైన ముగ్ధస్త్రీల చూపుల్లా మెరుపు తీగలు ఆకాశయవనికను చీల్చి నిద్రాముద్రితప్రపంచాన్ని చూస్తున్నాయి.

అప్పుడప్పుడు రైలు పట్టాలు తెల్ల త్రాచుపాముల్లా మెరుస్తున్నాయి. ఎక్కడో ఆకాశంకడుపులో గర్జన వినబడింది.

రత్నబాబు ఉలిక్కిపడ్డాడు అంత పరిచయమైన ప్రదేశంలో

జాగ్రదవస్థాప్రపంచంనుండి జారిపడ్డాడు.

అనుభూతివాహిని తీరాన్ని అధిగమించాడు.

చుట్టు కలయజూచాడు—

చీకటి సామ్రాజ్యం; సామ్రాట్టులాగానిల్చున్న పడమట దిక్కున పర్వతం; పురోహితునిలాగా నిలబడిన దక్షిణపు దిశన సంగమేశ్వరుని దేవాలయం; దేవాలయానికి దాపున ఎదురుగా కూనరాగాలతో ప్రవహించే యేరు సవ్వడి; ఈతపొదలు, చింతచెట్లు.

కన్నుల్లోనుండి రెండు నీటిబొట్లు తుంగమొక్కల మీద రాలిపోయాయి. కన్నీటిలో నిద్రపోయిన గాథలు చల్లగా కళ్ళు విప్పుకొన్నాయి. హృదయంలో ఘనీభవించిన అనుభూతి ద్రవించింది. వర్తమానం మనస్సుయొక్క వయస్సును అడిగింది. భూతకాలం కనులముందు నాట్యమాడింది భీతావహంగా.

ఆరు సంవత్సరాల క్రిందట జరిగిన సంఘటనలు :

ఉదయాన్నిలేపే లేత సూర్యుడు; రాత్రిని జోకొట్టే జాబిల్లి; ప్రకృతిని ఆవరించిన పచ్చని చెట్లు;. నిశ్చల పర్వతాల వరుస; గలగలమని నురుగులతో పారే యేరు—ప్రపంచంలోని ప్రతి అందం తనదనుకొనే 'స్వార్థం నిండిన' వ్యక్తి రత్నబాబు.

అలాగే అనిమి కూడా తనదనుకొన్నాడు. అలా అనుకోడానికి కారణాలు బోలెడు. ఆకారణాలు :

అనిమి లంబాడి పిల్ల. రత్నబాబు ఇంటికి ఏభై గజాల దూరంలోనే యిల్లు. లోకంఅంటే అర్థంకాని వయసునుండి వారిద్దరికి స్నేహం ఏర్పడింది. పండుగలు, ఉత్సవాలు, ముంజల కాలం, మామిడికాయలకాలం వారి పరిచయంలో ఒకవిధమైన ఆప్యాయతను సంపాదించిపెట్టాయి. వారినెవరూ అడ్డగించ ప్రయత్నించలేదు. ఎందుకంటే ఎవరికీ వారి ఉనికివిషయం అట్టే జాగ్రత్త తీసుకొనవలసిన అవసరం లేకపోయింది. విశాల ఆకాశంలో ఎగిరే పక్షుల్లాంటి జీవితం, జీవితాన్ని అర్థం చేసుకొనేంతవరకు లోకాన్ని గమనించి ప్రారంభించినప్పటి నుండి అలానే సాగింది.

రత్నబాబు పదవతరగతి చదువుతున్నాడు. ఎప్పుడైనా అనిమిని చూడాలనుకొంటే వాళ్ళ యింటిమీదుగా ఒక పుస్తకాన్ని తీసుకొని వెళ్ళి, కొద్ది దూరంలోవున్న తుంగభద్ర కాలువగట్టుమీద, వేపచెట్టుక్రింద కూర్చునేవాడు. అనిమి కూడా ఆ అవకాశాన్ని సరియైన విధంగా సద్వినియోగపర్చుకొనేది. పుల్లలకంటూ చిన్న బుట్ట పట్టుకొనివచ్చి ఈత పుల్లలు కోస్తూ, ఏవో వాళ్ళ భాషలో శ్రావ్యంగా పాడుతుండేది.

వేపచెట్లనుండి వ్రేలాడుతూ సోయగంగా కదులుతున్న గురిగింజ తీగలు, బొప్పాయి చెట్లమీద పండు కాయల్ని ఆరగించి అరుస్తున్న కాకులు, చిన్నగాలికి మోతచేస్తున్న తాటిజీబు కదలిక, గుస గుసమని సవ్వడులతో ప్రవహిస్తున్న కాలువ—అంతా క్రొత్తగా వుండేది వారికి. మచ్చిక చేయబడిన 'జంతువు' అనిపించేది ప్రకృతి.

'పాట బాగుందా ?' అని అడిగేది. బాగుందని తనకు తెలుసు. అయినా బాగుందని ఒకరు అంటే దానిలోని తృప్తి స్వయంగా అనుకొన్నదానికన్న యెక్కువ కాబోలు! రత్నబాబు 'బాగాలేదు. గందరగోళంగా వుంది. ఛీ' అనేవాడు.

బుంగమూతి పెట్టుకొనేది. దొంగతనంగా అనిమి ముఖాన్ని చూచేవాడు. పెదవి యెందుకంత ఎరుపుగావుంది అనుకొనేవాడు. లోలోపల నవ్వుకొనేవాడు.

"నే వెళ్తాను అలా అంటే' అనేది తెచ్చిపెట్టుకొన్న కోపంలో.

'వెళ్ళూ; నిన్నెవరూ పట్టుకోలేదుగా?'

ఆమాట వినగానే చరచరవెళ్ళిపోడానికి ప్రయత్నిస్తున్నట్లు నటించి యెదురుగా కూర్చునేది. కన్నుల్లో నీటి తెరలు కదలాడేవి. ఇంకా ఒక్కమాట రత్నబాబు అన్నాడా—అనిమి కన్నుల్లోని మేఘాల వర్షాన్ని ఆపడానికి చాల శ్రమపడవలసి వుంటుంది.

'అబ్బే! గమ్మత్తుగా అంటే ఏడుస్తావేమిటి ఆడపిల్ల లాగా' అని నాలుక కరుచుకొనేవాడు రత్నబాబు. కిలారుమంటూ నవ్వేది అనిమి. ఆ నవ్వులోని స్వభావాన్ని, విధానాన్ని నిర్ణయించే శక్తి రత్నబాబుకు అప్పుడు లేదుగాని ఆ నవ్వు రత్నబాబుకు తృప్తిగా వుండేది. హృదయం యిష్టమైన వస్తువుమీద స్వభావనిర్ణయం చేయదేమో! ఆవిధంగా సంధ్య వచ్చేవరకు జరిగేది.

ప్రపంచంమీద కోపగించిన వానిలాగా సూర్యుడు పడమటిదిక్కున తాటితోపులోకి చరచర వెళ్లిపోయేవాడు జేగురు రంగు ముఖంతో. ప్రణయకోపంతో వెళ్తున్న ప్రియుణ్ణి చూసి అరగా నవ్వుతున్న అభిసారికలలాగా చుక్కలు మిల మిల మని మెరిసేవి. సిగ్గుగా ఉదయిస్తున్న నెలవంక ముఖానికి సన్నని వలిపెపు ముసుగులాగా మబ్బులు కమ్ముకొనేవి. చీకటి తెరలు లోకాన్ని ఆవరించేవి.

అనిమి, రత్నబాబు మామూలుగా మాట్లాడుకొనేవారు. ఆరోజు జరిగిన విశేషాలు, గమ్మత్తయిన సంగతులు చెప్పుకొనేవారు. అట్లా అనుకొంటేనే సన్నిహితత్వం ప్రగాఢంగా వుంటుందనివారి నమ్మకం.

చీకటి వ్యాపించడంచూసి యింటికి వెళ్ళిపోయేవారు. ఇది వారి దైనందిన కార్యక్రమం.

ఒకవేళ ఏరోజునైనా యిద్దరిలో ఎవరైనా నిర్దేశ ప్రదేశానికి రాకుండా వుండడం జరిగినట్లైతే సంభవించే సంఘటన కొంచెం తీవ్రంగా వుండేదే! ముందుగా వచ్చిన వ్యక్తి రానివ్యక్తితో కొంతసేపు మాట్లాడకుండా వుండడం చెప్పకుండా వెళ్ళినందుకు పరిహారంగా తినుబండారాలు తీసుకొని రావడం, ఇకముందు అటువంటి పరిస్థితి జరుగదని, హామీగా, ఒట్టులాంటిదాన్ని నిర్ణయించుకోవడం యిత్యాది. సాధారణంగా ఇటువంటి పరిస్థితి ఎప్పుడోకాని జరిగేది కాదు.

ఒకసారి అనిమి రెండు రోజులవరకు కనబడలేదు. రత్నబాబుకు ఏమిటో మనసులో మసకగా అయిపోయింది. పాఠాలమీదకు మనసు పోయేదికాదు. భోజనం సహించేది కాదు. తల్లిదండ్రులు కొంచెం ఆశ్చర్యపోయారు. ఒంట్లో సుస్తీచేసిందేమో అనుకొన్నారు. మూడవ రోజు అనిమి కనిపించింది. అనిమి రెండురోజుల్లో చాల చిక్కిపోయినట్లనిపించింది.కళ్ళల్లో యేదో ఆకాంక్ష బయటకు తొంగిచూసింది. రత్నబాబును చూసిన మొదటి చూపులోనే ఆమె కన్నుల్లో నీటి బుగ్గలు ఉబికి బుగ్గలమీదుగా జారిపోయాయి. రత్నబాబుకు మనసు అదోలా అయిపోయింది.

తర్వాత అనిమి చెప్పింది : వాళ్ల అక్క ఇంటికి రత్నబాబుకు చెప్పకుండా వెళ్లడం జరిగిందనీ, అక్కడ తనకేమీ మనసు బాగుండలేదనీ, ఏమిటో పాపం చేసినట్లు అనిపించిందనీ, ఇకముందు అటువంటి పరిస్థితి ఎప్పుడూ పరస్పరం తెలియబరచుకోకుండా జరుగకూడదనీ.

రత్నబాబు ఆశ్చర్యపడ్డాడు. తనలాంటి పరిస్థితి అనిమికి కూడా ఎలా తటస్థపడిందా అని ఆలోచించాడు. ఇంకా అతని హృదయం అనుభవాలకు గురికాలేదు కాబట్టి నిర్ధారణగా ఆలోచించడానికి ఆస్కారం కూడా లేకపోయింది.

పండిపోయి రాలిన ఆకుల్లాగా సంవత్సర వృక్షంనుండి రోజులు రాలిపోతున్నాయి. హృదయం రోజురోజు అనుభవాలతో బలుస్తున్నది. మనసు విశాలమౌతున్నది. దృష్టి మారుతున్నది.

రత్నబాబు, అనిమీల స్నేహం చెట్లపూతలాగా అభివృద్ధిచెందుతున్నది. ఆసంవత్సరపు వేసవి గడచింది.

రత్నబాబు యస్. యస్. ఎల్. సి. క్లాసుకు వచ్చాడు. అనిమి సిగ్గుతెరల సమీపానికి వచ్చింది. వారి స్నేహం పూర్వం లాగే సాగుతున్నది. రత్నబాబుతో చదువుకొనే కొంతమందికి అనిమితో స్నేహం విషయం తెలిసింది. అందుకనే యెప్పుడైనా రత్నబాబును గేలిచేయాలంటే ఆ విషయాన్ని మిషగా తీసుకొని 'ఏయ్ లంబాడీ!' అనేవాళ్ళు. రత్నబాబు చిరునవ్వు నవ్వేవాడు. అంతేగాని రోషంతో, సిగ్గుతోబాధపడేవాడుకాడు. ఇదే సంగతి ఇంటిప్రక్కనవున్న అనిమి ఈడుగల ఆడపిల్లలకు తెలిసింది. ఆశ్చర్యంతో బుగ్గలమీద వ్రేళ్ళు పెట్టుకొని రత్నబాబును మ్యూజియంలోని జంతువును చూసినట్లు చూచేవాళ్ళు. రత్నబాబు మనసులో నవ్వి ఊరుకొనేవాడు. కొన్నిసార్లు పిచ్చిగా నవ్వేవాడు. ఆ నవ్వులో అనూహ్యమైన భావన గుప్తమై వుండేది. కొన్నిసందర్భాల్లో కొన్ని విషయాల్ని అస్పష్టంగా తెలియజేయడానికి నిజంగా నవ్వుకు మించిన సాధనం లేదు. అలక్ష్యం, అవహేళన, అవమానం, ఆలోచనలను ఒక్క చిరునవ్వు ప్రదర్శింపగలదు; ప్రతిపాదింపగలదు. అదే నవ్వులోని మహాత్మ్యం! అదే శరణ్యమైంది అటువంటప్పుడు రత్నబాబుకు. అదే సందిగ్ధతకు తావు యిచ్చింది మిగతావాళ్ళకు.

అనిమి స్నేహం సంగతి రత్నబాబు తల్లిదండ్రులకు చూచాయగా తెలిసినా దాన్ని జాగ్రత్తగా తీసుకొనవలసిన విషయంగా పరిగణించలేదు. ఎందుకంటే ప్రమాదంగా పరిణమించే సమయం ఇంకా రాలేదు అనే ధైర్యంవల్ల కావచ్చు. రత్నబాబుకు తనను గురించి జరుగుతున్న వ్యవహారమంతా గమ్మత్తుగా వున్నదనిపించింది. ఇతరుల్ని అర్థం చేసుకొని, అనుసరించవలసిన అవసరం ఇంకా వస్తుందనే ముందుచూపు రత్నబాబుకు కలుగలేదు.

రోజులు రాలిపోతున్న గానుగ పూలలాగా జరుగుతున్నాయి. నెలలు నిండుతున్నాయి. సంక్రాంతిపండుగ సంతోషంగా గడిచిపోయింది. మార్చినెల జరుగుతున్నది. ఆరోజు ఆదివారం. రత్నబాబు పరీక్షలకోసం బాగా చదువుతున్నాడు. ఆ మరుసటిరోజు మహాశివరాత్రి. ఆరోజుకూడా సెలవు. ప్రతి సంవత్సరం శివరాత్రినాడు సంగమేశ్వరుని దేవాలయంలో బ్రహ్మాండంగా ఉత్సవం జరుగుతుంది. ఆరాత్రి నాటకం కూడా వేస్తారు. అందుకు మరుసటిరోజును స్మరిస్తూ, అనిమికి

ఆ సంగతి తెలియజేయాలని బయలుదేరాడు. కాని ఆమె కనబడలేదు. రత్నబాబు ఆశ్చర్యపడ్డాడు. ఎక్కడికి వెళ్ళిందా? అనే ఆలోచనల్లోపడి తుంగభద్ర కాలువగట్టు వెంట బయలుదేరాడు.

బాగా యెదిగిన పచ్చగడ్డిపొన్నులో ఊర బిచ్చుకలు సరసాలాడుకొంటున్నాయి. తాటిబొందలమీద ప్రాకిన దొండ తీగల పండ్లను కాకులు ఫలహారం చేయబోయి జారవిడచుకొంటున్నాయి. ఈతపూత నిశ్శబ్దంలాగా రాలుతున్నది. చిలుకదంపతులు తాడిచెట్లమీద పచారుచేస్తున్నాయి. మామిడిపూత మెసవిన కషాయకంఠంలో ఎక్కడో కోయిలలు స్పర్థతో కుహూకుహూధ్వానాలు చేస్తున్నాయి. ఈ వాతావరణాన్ని గమనించకుండా రత్నబాబు అనిమీని గురించి ఆలోచిస్తూ నడుస్తున్నాడు. 'నాకు చెప్పకుండా ఎక్కడకు వెళ్ళింది? కాబట్టి కనబడినా మాట్లాడకూడదు. మాట్లాడినా పలకకూడదు' అనుకొన్నాడు మనసులో. అట్లా మైలున్నర నడిచాడు. మనస్సు స్తిమితంగాలేదు. తాడిచెట్టు నీడక్రింద కూర్చొని తుంగ మొక్కల్ని లాగుతూ కూర్చున్నాడు. తాడిచెట్టు నీడ క్రమంగా మొదలులోనికి జరుగుతున్నది. కొంతసేపు గడిచింది. రత్నబాబుకు ఎరదురుగా ఒక ఆకారపు ఛాయ పడింది. తలయెత్తి చూశాడు. నవ్వులు చిందిస్తున్న అనిమి. రత్నబాబు మాట్లాడలేదు. తల దించుకొన్నాడు. ఒక నిమిషం మౌనంగా వుండి అనిమి రత్నబాబుకు ఎదురుగా కూలబడింది. అప్పుడు పావుమూటసంచి ప్రక్కన పడింది. దానిలో ఏమిటో వున్నట్లున్నాయి కాని రత్నబాబు చూడదలచుకోలేదు.

'మాట్లాడరా?' తల పైకెత్తి చూశాడు.

'నేను ఉప్పు అమ్మడానికి వెళ్ళాను'

'నాకెందుకు చెప్పలేదు?'

'మా అమ్మోళ్ళు ఈరోజునుండి ఉప్పు అమ్మాలి అన్నారు. ఇయిగో నూకలు. అందుకనేగా చెప్పంది' ప్రతిమాలుతున్నట్లుంది వైఖరి.

'ఎందుకు యిక్కడకు వొచ్చింది?' నెమ్మదిగా అడిగింది.

'పనిలేక........సరేనా'

'నాకు చెప్పరన్నమాట' ఆమె కన్నుల్లో ఇంక కొంచెంసేపట్లో నీళ్ళు తిరుగుతాయని ఊహించడానికి అట్టేసేపు పట్టలేదు. అనిమిముఖం చూసి నవ్వాడు. మూతి ముడుచుకొన్నది.

'నేను నిన్ను వెదుకుతున్నాను'

'ఎందుకూ?.......అయినా నేను యీవూరు వచ్చానని యెవరు చెప్పారూ?'

'దేవుడు.......సరేగాని రేపు ఒక చోటుకు వస్తావా? రావా?'

'ఎక్కడికో చెబితే'

'అయితే నేను చెప్పను'

'అయితే వస్తాను. ఎక్కడకో చెప్పుమరి'

'రేపు రాత్రి సంగమేశ్వరుని గుడిలో హరిశ్చంద్ర నాటకానికి'

'ఇయాల ఎన్నో రోజు?'

'రెండో తారీకు'

'పరీచ్చలు యింకా పదిమీద అయిదు రోజులేగా వుంది.'

'అయితే—'

'సదువుకోకుండా నాటకాలు యెందుకూ?'

'ఒకరోజు చదవక పోయినట్లైతే కొంపమునిగిపోతే చదవడం దండగ. ఇంతకీ వస్తావా? రావా?'

'అయ్యవారి మాటప్రకారం వస్తాం' లేచి నుంచున్నది. చెయ్యి అందించింది. రత్నబాబు చెయ్యి పట్టుకొని నిలబడ్డాడు. ఇంటికి బయలుదేరారు.

మాట్లాడవలసిన అవసరం కన్పించలేదు యిద్దరకు. బారులుతీర్చి నిలబడ్డ తాటిచెట్లను చూస్తూ నిలబడ్డారు. చిన్నపిల్లలు నవ్వినట్లు నవ్వుతున్నాయి దగ్గరితుమ్మచెట్లు పూలతో. నిమ్మపూలవాసన వుండి వుండి ఘుమాయిస్తున్నది. జిల్లేడుచెట్లమీద తేనెపిట్టలు శ్రుతి సరిచేసుకొంటున్నాయి.

అనిమి ఉషారుగా గెంతుతూ నడుస్తున్నది ముందు. రత్నబాబు వెనక నడుస్తున్నాడు. ప్రకృతి ప్రసవించిన శిశువులాగా అనిమీ ప్రకృతిమాతలో తాదాత్మ్యం చెందుతున్నది. పరిపూర్ణమైన మనశ్శాంతి లాగావుంది అప్పటి వాతావరణం.

'ఇదంతా.......చాలా. . . . . బావుందికదూ!' పరిసర ప్రాంతాన్ని కన్నులతో చూపుతూ అంది.

"అవునుగానీ.....ఇకనుంచి రోజూ ఉప్పు అమ్మడాని కెళ్ళాలా?'

'అవును......ఏం?" అన్నట్లు ప్రశ్నార్థకంగా చూచింది.

రత్నబాబు మాట్లాడలేదు. నడుస్తున్నాడు ఆలోచిస్తూ.

'అమ్మకపోతే ఎట్లా మరి? సరిగా గడవదుగా? మాకు యిదేగా చెయ్యాల్సిన పని'

రత్నబాబు అనిమి ముఖంవైపు చూశాడు.

'ఉప్పు అమ్మడమే నాకు బావుంది' రత్నబాబు వైపు చూస్తూ అదోమాదిరిగా కనురెప్పలు పైకెత్తి నవ్వింది.

'ఎందుకో?'

'నే జెప్పను' సిగ్గు ముఖంలో తారట్లాడింది.

'నాక్కూడా చెప్పవన్నమాట'

'ఉహూ....మరే......మనం రోజూ ఇట్టాగే మాట్లాడుకోవచ్చుగా? అందుకని'

'ఆ......అవును' అన్నాడు. కాని అదివరకుచోటున యెందుకు మాట్లాడుకోలేదో అనే విషయం స్ఫురించలేదు.

'మనం......అదివరకు వేపచెట్టుక్రింద మాట్లాడడానికి ఇంక కుదరదుగా! నేను పెద్దదాన నవుతున్నాను. ఈ మాట మా అమ్మ అంది. ఎవరితో మాట్లాడకూడదంట' అంది తన్ను తాను చూసుకొంటూ.

'నిజంగానా?! ఆపాదమస్తకం పరీక్షిస్తూ అన్నాడు. సిగ్గుమొగ్గలు విరిసి ముఖంలో వెన్నెలలు కురిశాయి.

అప్పుడే ఆకాశంలో మబ్బు తునకలు ఒక ఆకారాన్ని యేర్పరుస్తున్నాయి. సూర్యుణ్ణి మబ్బులు కౌగలించుకొని కరగించి వేశాయి.

అదిగో! మీ యిల్లు దగ్గిరకు వచ్చింది. రాత్రి సంగమేశ్వరునిగుడికి—మర్చిపోవుగా? నే వెళ్తున్నా'

''ఓ......' అంది అనిమి.

## 2

చీమలు కుట్టగా స్మృతుల్లోనుండి మేల్కొన్నాడు రత్నబాబు. చీకటిచెలియ నీలిహస్తాలు ప్రపంచాన్ని అప్యాయంగా స్పృశిస్తున్నాయి. మళ్ళా మూడుసంవత్సరాల తర్వాతివిషయాలు మనసులో కదిలాయి.

ఒకనాటి వేసవి సాయంత్రం ఒక కుర్రవాడు హుషారుగా ఈలవేసుకుంటూ ఎడ్లబండినుంచి దిగాడు. పరిసరాల్ని సునిశితంగా పరిశీలిస్తున్నాయి అతని చూపులు. వాతావరణం యెంతో ఆహ్లాదంగా వున్నదనిపించింది అతనికి. అతని వయస్సులాగే ప్రకృతి చలాకిగా వుందనిపించింది. ఊపిరాడని యిరుకు గదిలోనుండి విముక్తి పొందిన ప్రయాణికునిలా ఆనందంలో మునిగిపోతున్నాడు. ఏదో ఉత్కంఠ ఉబికి, ఉరకలు వేసి, ఊహావేగంతో ఆ వ్యక్తిని అలముకొన్నట్లుగా వుంది.

తలల బరువుతో తాటితోపులు—ప్రకృతికాంత ఆర వేసుకొన్న హరితవర్ణపు చీరెలాగా మిసమిస మెరుస్తున్న అరటి తోటలు—పరిణయచిహ్నాల్ని వ్యక్తపరుస్తున్న మదవతిలాగా యౌవనభారాన్ని వహించినట్లు కనబడుతున్న కొబ్బరి తోటలు—పిల్లతెమ్మెరల అతిథులు పలకరింపులకు కమ్మని సీత్కారంలాగా, సౌరభ్యాన్ని పుక్కలిస్తున్న నిండుపూల నిమ్మతోటలు.....

ఏదో సమ్మోహనమైనదిగా అగపడింది ప్రకృతి. అంతా పూర్ణంగా, తృప్తిగా ఉన్నప్పటికీ యేదో లుప్తమైనట్లనిపించింది. నెమ్మదిగా బండి ప్రక్కన నడుస్తున్నాడు.

పందొమ్మిది సంవత్సరాల యువకుని ఉద్వేగాన్ని గమనించిన నలభై అయిదు సంవత్సరాల బండి తోలుతున్న మనిషి ఇక మౌనంగా ఉండలేకపోయాడు. అంతలో ఆ యువకుడే అతని శ్రమ తగ్గించాడు.

'చూడు దేవయ్యా! మరే అనిమి యింటిదగ్గర వుందా?'

దేవయ్య ఆశ్చర్యంగా కళ్ళు మిటకరించాడు.

'అట్లా చూస్తావేమయ్యా! లంబాడీపిల్ల అనిమి తెలియదటయ్యా! భలేవాడివేనే' అంటూ చిరునవ్వునవ్వాడు దేవయ్య ముఖం చూస్తూ.

'నాకెందుకు తెలియదు రతనబాబూ! ఆ యిసయం తమరు మరిసిపోలేదు గమాల అని చూత్తన్నా. అయినా తమరికెందుకుండి దాంతో సేయితం. మంచి బువ్వలోకి మంచి కూరగావాలికాని యెందుకుబాబు అనవసర ప్రేకులాట. మన కొద్దు బాబు ఆ గొడవ. నా మాట యిని ఆ పిల్లని మరిసిపోండి'

''దేవయ్యా' అన్నాడు. ఇంకేం మాట్లాడలేదు.

'ఏం బాబు కోపమొచ్చిందా? మీరు గొప్పగా సదివినోరు. సాల యిసయాలు తెలుసుండవచ్చు. అయితే బతుకులో సాయంగా మాకున్న మంచి సెబ్బరల యిలవ మీకు తెల్దు. సాల పొంగు లాంటి వయసులో సాలాసాలా అనుకొంటారు పిచ్చి పిచ్చిగా. అదంతా వొట్టి బెమ. నిజంగా వొట్టి బెమే! నేనూ నా కుర్రకారులో గట్టుమీద మాలచ్చి కూతురు కనకం అంటే మా పెద్ద మోజుపడ్డా. కాని పెద్దోల్లు వొప్పుకోలా. థూత్ అన్నారు. ఎలేత్తా మన్నారు. అబ్బే నే లెక్కజేయలా. చివరికంటా తెలిసింది మన పని బురదలో యవ్వారమని. ఇకఛట్టున మానేశాను. అప్పటికి, యిప్పటికి అంతే. అయినా ఆ రోజులు...' పరధ్యానం చిత్తగించాడు దేవయ్య.

దారిప్రక్కన రాలిపోయిన మామిడిపిందెలను చూస్తూ రత్నబాబు నడుస్తున్నాడు. వాటిలో పెద్దవి, చిన్నవి వున్నాయి. రత్నబాబు పెద్ద కాయను, చిన్నకాయను తీసుకొని కొరికి చూశాడు. రుచిలో తారతమ్యాలు కన్పడ్డాయి. అతను మనసులో నవ్వుకొన్నాడు. మనసులోని నవ్వు ముఖంలో ప్రస్ఫుటించింది. ఆ నవ్వు దేవయ్య చూడక తప్పిందికాదు. తన విషయాన్నిగురించే నవ్వాడనే అపోహతో దేవయ్య సిగ్గుపడ్డాడు. తర్వాత అయిదు నిముషాలు మౌనం వారి మధ్య జపం చేసింది.

'దేవయ్యా'

'ఆఁ............పిలిశారా బాబు'

'ఊఁ.........అనిమి అంటే యెందుకు నీకు కోపం. ఆ అమ్మాయి మంచిదికాదా? బావుండదా? లేకపోతే.......'

'మంచి, సెడు యేంటి బాబూ! మనోళ్ళకి గావలసింది కుటుంబ సంప్రదాయకంగాని. పెద్దోళ్ళ ఇట్టం లేకుండా మనం యేం జేస్తాం బాబు. అందాన్ని, ఎరువును కొరక్కు తింటారా యేంటి? అంత చక్కనోళ్ళు మన యిళ్ళల్లో వుండరా బాబు! మీ పిచ్చిగాని. ఆ విషయాన్ని అలా వుంచండి. నా మాట యినండి' యింకా ఏదో మాటాడబోయాడు దేవయ్య పాపం పరోపకార పారాయణుడు అవ్వాలనే జిజ్ఞాసలేని జిజ్ఞాసతో.

'దేవయ్యా......నీ గొడవే....నీదిగాని.....నా గొడవ ఏమన్నా ఆలోచించావా? ఎందకు అలా సోది అర్థం పర్థం లేకుండా' చిరాకుతోమాత్రమే అన్నాడు.

పరేంగితజ్ఞాని దేవయ్య రత్నబాబుమాటల్లో వేడిని గ్రహించాడు. నలభై అయిదు సంవత్సరాల రక్తంలోని ఆలోచన ఉడుకురక్తపు ఉరవడిలోని వేగాన్ని నివారించలేనని సవినయంగా ఒప్పుకొన్నది. రెండు మనస్సుల తులాదండం ఒక వైపు మొగ్గుచూపడానికి అవకాశం కలుగజేస్తున్నది. దూరంగా ఊరు కానవస్తున్నది. నాలుగుకళ్ళలో రెండుకళ్ళు ఊరును నిశితంగా చూశాయి.

'మన ఊరు బాగా మారిపోయిందయ్యా. పొలిమేరదగ్గర తుమ్మసీకెలు చాలా పెద్దవి అయ్యాయే.'

'అవునయ్యా'

తర్వాత యిద్దరిలో ఎవరూ మాట్లాడుకోలేదు. ఊరు సమీపించింది. రత్నబాబుకు తెలిసినవారందరూ ఆప్యాయంగా పలకరించారు. కృత్రిమవాతావరణంనుంచి వచ్చిన రత్నబాబుకు అక్కడి వాతావరణం హాయి అనిపించింది. స్నేహితుల, సన్నిహితుల, బంధువుల ఆర్ద్రకంఠాలలోని వాత్సల్యం వర్ణనాతీతమైన సంతోషంగా కనబడింది. హృదయం పరిచయ ప్రాంతదర్శనతో పరవశమైపోయింది. హృదయానికి ఒకసారి సన్నిహితమైన ప్రదేశాలు, వ్యక్తులు, వస్తువులు ఎంత ఛండాలంగా, వికారంగా అల్లాటప్పగా వున్నప్పటికి తర్వాత

అదే వస్తువులోని అవలోపం కన్పించదు ఎందుకనో? అనిపించింది రత్నబాబుకు. కాకికిపిల్ల కాకిముద్దు కదూ! అనుకొన్నాడు మనసులో నవ్వుకొంటూ.

ఇల్లు దగ్గరకు వచ్చింది. రత్నబాబు మనసులో ఉత్సాహం ఉబికింది. వంటగదిలోనుండి చేయి తుడుచుకొంటూ వచ్చిన శ్రీదేవమ్మ కొడుకును కళ్ళారాచూసి ప్రక్కకు తిరిగి కన్నులు తుడుచుకొన్నది. ఆనందబాష్పాలు. ఒక్కకొడుకుగనుక.

'అమ్మా' అంటూ దగ్గరకు వెళ్ళాడు.

మందహాసంతో కొడుకును చూసి మెటికలు విరచుకొన్నది, శ్రీదేవమ్మ. పెట్టె, బెడ్డింగ్ ఇంట్లోపెట్టి పశువుల సావిట్లోకి వెళ్ళాడు దేవయ్య.

శ్రీదేవమ్మ దృష్టికిరణాలు రత్నబాబు శరీరాన్ని స్పృశించాయి. ఆమెహృదయం ఉప్పొంగి పరవశమైపోయింది.

'నాయనా! బాగున్నావా? చిన్నమ్మవాళ్ళు బావున్నారా? నీతో వస్తామన్నారు రాలేదే?'

''సమయానికి యేదో పనుండి ఆగిపోయారమ్మా. అంతా బాగానే వున్నారు. వీలుంటే నిన్నొకసారి రమ్మన్నారు' అన్నాడు చొక్కా విడుచుకొంటూ.

'దానికేంగాని త్వరగా స్నానంచేయి. భోంచేద్దువుగాని. మీ నాన్నగారు ఏదో పనుండి ప్రక్క ఊరు వెళ్ళారు; రేపు గాని రారు' అంది.

బట్టలు తీసుకొని స్నానానికి నిష్క్రమించాడు రత్నబాబు.

స్నానభోజనాదులు నిర్వర్తించేటప్పటికి ఎనిమిది గంటలయింది. బయట మంచంమీద పండుకొని నక్షత్రాలు లెక్కిస్తున్నాడు రత్నబాబు. నక్షత్రాలు ఎప్పుడు చూసినా, ఎంత చూసినా దగ్గరకు రావుగదా! అనంతదూరంనుండి మినుక్కుమంటూ చూడడమే వాటి పని. కాని మనుష్యులైతే ఆయువున్నంతలో యేనాడైనా కలుసుకోవచ్చు. పరస్పరం హృదయాలువిప్పి మాట్లాడుకోవచ్చు. ఈ జ్యోతిర్మార్గంలోనే సూర్యచంద్రులు సంచరించాలని ప్రకృతి యెందుకు శాసించింది? ప్రకృతికే నియమాలున్నాయిగాని మానవప్రకృతికి పిధియైన నియమాలు అంగీకరించాలా? కాదు మానవప్రకృతిలో జాతిజాతికి భిన్నమైన నియమాలు, సంప్రదాయాలు రూఢమైపోయాయి. వాటి యోగ్యతాయోగ్యతల పరిశీలనల వల్ల ప్రయోజనం కలుగుతుందా? సాయంత్రం దేవయ్య చెప్పిన మాట జాతిగీతకిందకు వచ్చే విషయం మాత్రమే! మానవనైజాలు ఎంత వైకల్పికాలు! ఈ వైకల్పిక కల్పనల పద్మవ్యూహంనుంచి అనిమీ సాన్నిహిత్యం......పిచ్చిగా నవ్వుకొన్నాడు రత్నబాబు. తనకు నచ్చిన మంచివిషయానికి, చెడ్డవిషయానికి హృదయం సక్రమవిషయాలలోని బెడ్డను, వక్రవిషయాలలోని మంచిని హంసలాగా స్వీకరిస్తున్నదెందుకో!?—ఆలోచనా తంతువు తెగి అనిమిరూపం సాక్షాత్కరించింది.

ప్రక్కయింటి ప్రాంగణంలోనుండి పిట్టగోడ దూకి, సన్నజాజుల పరిమళం ప్రవహిస్తున్నది. ఎదురుగా తలవూపుతున్న గులాబి మొక్క తలమీద పువ్వునుండి అప్పుడప్పుడు సువాసన వస్తున్నది. మల్లెపూలవాసన వస్తే యెంత బాగుండును అనుకొన్నాడు రత్నబాబు.

అనిమి ఎలా వుంటుంది? నునుసిగ్గు దొంతరల తెరల నడుమనుండి దర్శనమిస్తుందా? మేఘాల మృదుహస్తాలనుండి జారిపోయి జంకుతూ, మెల్లగా సాగిపోయే జాబిల్లిలాగా..... ఇంకా ఏవేవో ఆలోచనలు ముస్తిష్కంలో దాగుడుమూతలాడుకొన్నాయి.

నిద్రపట్టలేదు రత్నబాబుకు.

షికారుకని అనిమీ యింటిమీదుగా వెళ్ళి వంతెనమీద కూర్చున్నాడు. అనిమీ యింటిమీదనుండి బయటికి వచ్చేటప్పుడు హృదయంలో భయంతో కూడిన ఉత్సాహం కదిలింది. ఆత్మీయమైన పరిచయప్రదేశానికి రాగానే యెంతో తృప్తి కలిగింది. వంతెనమీదకు వెళ్ళి కూర్చున్నాడు. సప్తమినాటి చంద్రుడు గుబురు బూరుగుకొమ్మల్లోనుండి తొంగి చూస్తున్నాడు. రత్నబాబుకళ్ళు చీకటిలో అనిమీ యింటివైపు తొంగి చూస్తున్నాయి. ఆ చూపు యెంతో తృప్తిని నింపుకొన్నది.

—అనిమి యిప్పుడు నిద్రపోతూ వుంటుంది కాబోలు! నేను వచ్చానని తెలిస్తే యెంత సంతోషిస్తుంది? ఎంత మురిసిపోతుంది! పలకరిస్తుందా? అలుగుతుందా? ఎలా మాట్లాడాలి? యెక్కడ మాట్లాడాలి? మనసులో యేమిటో జంకుగా వుందే? వయస్సువచ్చినవారిపైన సంఘం విధించిన అంతరాకాంక్షా యిది? దొంగతనంగా వెళ్ళి అనిమీని లేపితే! అమ్మో కొంప మునిగిపోదూ! ఉన్న గౌరవం, కీర్తి అన్నీ మట్టికొట్టుకుపోతాయి. ఏమి టీ మనస్సు ఆవేగం? కొన్ని విషయాల్లో మనస్సుకు సంయమనం చేద్దైపోతుందే? — అనుకొన్నాడు.

ఆ ప్రాంతాన్ని చూశాడు. దూరంగావున్న వేపచెట్టు గుబురులో పరిభ్రమిస్తున్న మిణుగురుపురుగుల మినుక్కు — వంకతాడిచెట్ల అందమైన వరుస — అద్దంలాగా నిశ్చలంగా వుండి చంద్రకిరణాలను తనలో పర్యాప్తం చేసుకొంటున్న స్తంభించిన తుంగభద్ర ప్రవాహం — తుంగమొక్కల సోయగపు కదలిక—తన బాల్యపు దినాలలో దాచుకొన్న అనుభవాల నీడలు ఒక్కటొక్కటిగా పరిసరపర్యాలోకనంతో విస్మృతి పథాన్ని అధిగమించాడు.

వేపచెట్లకువేసి ఊగిన ఉయ్యాలలు — వంకతాడి చెట్లవెంట పరుగెత్తిన తీరులు, తుంగభద్రకాలువలో అనిమి పరిగచేపలను పట్టినరోజుల్లో సంఘటనలు, వెన్నెల రోజుల్లో దాగుడుమూతలు, హృదయాంతరాంతరంలో మృదువైన చక్కిలిగింతలు........

అప్పుడులాగా యిప్పుడు సాధ్యమౌతుందా?

వయస్సు వచ్చినతర్వాత యెన్ని నిబంధనలు! మనస్సుకు యిష్టమైన పదార్థాలమీద ఆలోచనల శల్యపరీక్ష యెందుకో? అధికారం, హోదా, సంఘంలో పలుకుబడి, రూపాయిగా చలామణికావాలనుకొన్న వ్యక్తుల కఠోర నిర్ణయం తప్పితే నిజంగా అందులో ఏమన్నావుందా?

పోనీ ఈ విషమపరిస్థితులకు దూరంగా అనిమిని మరచిపోతే! ? ఇంతకన్న ప్రత్యక్షహృదయగోపనం ఇంకొకటి వుంటుందా? అయినా యెలా సాధ్యం? పెద్ద విషయాల మీద అల్పవిషయాల సమన్వయం తేలికగా సరిపోయినట్లనిపించినా తర్వాత........?'

అనిమీకి పూర్వంలాంటి ఇష్టమే వున్నదని నమ్మకమేమిటి? ఛా......ఛా.......మనస్సుకు కళ్లెం పోయింది. ఇప్పుడు ఆలోచించకూడదు—అనుకొన్నాడు రత్నబాబు.

మబ్బులదుబ్బుల్లో చంద్రుడు విసుగ్గా పయనిస్తున్నాడు. గాలి ఉసూరుమంటూ నెమ్మదిగా వీస్తున్నది. నక్షత్రాల మినుక్కులో అలసత గోచరించింది.

రత్నబాబు కన్నుల్లో నిద్ర దోబూచులాడింది. ఊళ్లోనుండి కుక్కల అరుపులు వినిపించాయి. నెమ్మదిగా నడచి యింటికి వెళ్ళాడు. కొడుకు రాకను గమనించిన శ్రీదేవమ్మ 'ఎక్కడకు వెళ్ళావురా' అంది.

'ఆఁ......ఇక్కడికేనమ్మా' అంటూ మంచంపై మేను వాల్చాడు. నిద్రాదేవి వెంటనే కౌగలించుకొన్నది.

## 3

కోకిలల మధురగీతాలతో ఉషోదయమైంది. రత్నబాబు నిద్రనుండి లేచాడు. కాలకృత్యాలు అయినతర్వాత అనిమి యింటివైపు నడక సాగించాడు. అనిమి యింటిముందరి ములగచెట్లు తెల్లపూలతో ఉల్లాసంగా కనిపించాయి. మెట్టతామరపూల రంగులదుస్తులు ధరించిన లంబాడీ వనితలు బావిదగ్గరనుండి నీళ్ళు తెస్తున్నారు. మోచేతివరకువున్న దంతపు గాజులలోనుండి వారి తెల్లనిశరీరాలు అదో క్రొత్తసొగసును సంతరిస్తున్నాయి. కాళ్ళ వాంకుడీలు గలగలమని మోగుతూ ధూళికణాలకు మోహాన్ని కలుగజేస్తున్నాయి. వాళ్ళయింటి వెనకాల రెండు తెల్ల కుక్కలు సరసాలాడుకొంటున్నాయి. ఆ ప్రదేశం అంతా క్రొత్తగావుంది. కాంక్షగా చూస్తున్న రత్నబాబుకు అనిమీ జాడ కన్పించలేదు. కనబడుతుందనే ఆశతో కళ్ళు ఆత్రంగా పరిశీలిస్తున్నాయి. లంబాడీవనితలు సుతారంగా నవ్వుతూ యిళ్ళలోనికి వెళ్ళారు. వెంటనే ఇద్దరు వనితలు నీళ్ళకు బయలుదేరారు. వారిలో ఒకతె ముసుగు వేసుకొన్నది. ఒకామె వయసు మళ్ళినటువంటిది. రత్నబాబు కొంచెం దగ్గరకు వెళ్ళాడు. ముసుగువేసుకొన్న యువతి రత్నబాబును చూచింది. అంతే! విద్యుత్ప్రసారానికి శరీరం చలించేవిధంగా హృదయం వేగంగా స్పందించింది. కన్నుల్లో ఆనందబాష్పాలు తొంగిచూశాయి. మనసు మేఘాల నునుపు అంచులమీద హాయిగా, లీలగా నడయాడింది. శరీరం అంతటా సంతోషం విషంలాగా వ్యాపించింది. అచేతనంగా నిలబడిపోయింది అనిమి. స్తబ్ధుడైపోయాడు రత్నబాబు. తోటి లంబాడీస్త్రీ అదిలింపుతో స్మృతి కలిగింది, యిరువురకి గాలికి విడిపోయే మేఘశకలాల్లా వారి పరస్పర దృష్టుల పరామర్శ ఆగింది. అచిర వియోగభరాన్ని వహింపలేక పర్వతంలాగా సాగిపోయింది అనిమి. వ్యథాపరిభూతమైన మనస్సుతో విశ్చలపర్వతంలాగా వుండిపోయాడు రత్నబాబు. అంతరాత్మలు సన్నిహితంగా శరీరంతో సంబంధం లేకుండా సంభాషించుకొన్నాయి. సంతోష సంభ్రమాలలో కన్నులు చెమ్మగిల్లాయి. నెమ్మదిగా నడిచివెళ్ళి వంతెనమీద కూర్చున్నాడు. మనసులోని భావాలు సవ్యాపసవ్యంగా సంచారాలు సాగించాయి. గతస్మృతులతీయని కలలు కనులముందు మెరిశాయి.

నీళ్ళు తీసుకొని లంబాడీవనితలు యిద్దరు రావడం జరిగింది. అనిమి ఒక్కసారి నిమీలినేత్రాలతో లీలగా రత్నబాబు కూర్చున్నవైపు చూచింది. ఆ చూపులో అగాధ భావభంగిమలు గోచరించాయి. మేఘమాలికల మాటున మరుగుపడే శంపాలతలా అనిమిరూపం దృష్టిపథంనుండి తప్పించుకొని ఇంట్లోకి వెళ్ళింది.

రత్నబాబు ఏకాకిగా వంతెనమీద కూర్చున్నాడు. మనసు ఆందోళనతో పరిభ్రమిస్తున్నది. హృదయానికి సన్నిహితమైన వస్తువు ప్రత్యక్షంగా వున్నప్పుడు కూడా ఎందుకో ఒకప్పుడు ఆత్రత? అనుకొన్నాడు. నిజానికి కొన్నిగజాల దూరంలో వున్నప్పటికి కొన్ని వందలమైళ్ళ దూరంగా హృదయం భావిస్తున్నది. పలకరించడానికి వీలుకాని పరిస్థితిలో ఆమెను అపరిచితవ్యక్తిలాగా భావించడానికి మనస్సు తొందరపడుతున్నది. అనిమి "వస్తుంది—రాదు" అనే ధ్యాస కారణంగా మనసు ద్విపాత్రాభినయంచేస్తున్నది.మనసులోని మనస్సులో-ఆశలురాశలు, వూహలు — అపోహలు, ఆవేగం—నిదానం, సంక్షుభిత సముద్రంలో తరంగాల్లా వర్తమానమనే తీరానికి తగిలి అదృశ్యమైపోతున్నాయి. మనసును ఏదో వ్యసనం, వ్యాకులత, సంచలింపజేస్తున్నాయి.

'ఎపుడు వొచ్చారు? బాగున్నారా?' అని ముద్దుగా అడిగిన పదిసంవత్సరాల లంబాడీ చంద్రిమాటలతో రత్నబాబు మనసుకు చైతన్యం కలిగింది.

'ఓ......చంద్రీ! బాగున్నావా? ఏమిటి సంగతులు? పెద్దదానివి అయ్యావే! మీవాళ్ళు అందరూ బావున్నారా? ఎక్కడికి బయలుదేరావ్?' ప్రశ్నల వర్షం కురిపించాడు.

'ఇక్కడికే......బట్టలుదకడానికి. నేను దూరంనుండే చూశా. మీరే అనుకున్నా. ఇక్కడేగా మీరు యెప్పుడూ కూరుసునేది' అంది చిరునవ్వుతో.

'ఇప్పుడు ఉతుకుతున్నావుగానీ ఎన్ని రోజులకు అరతాయంటావు. సరేగానీ మీ భాయి (అక్క) అనిమీబావుందా? ఏం........అదివరకులాగా కనబడ్డంలేదే ? ఏమిటి గిరాకి ?' అన్నాడు కళ్ళు అనిమి యింటివైపు తిప్పుతూ.

చంద్రి కిసుక్కున నవ్వింది. తర్వాత అంది : 'అదివరకులాగా ఎలా కనబడతది. బెల్లం తిన్నదిగా?'

'ఏం.....బెల్లంతింటే కనబడగూడదా?'

'అవ్వా! బెల్లందిన్నతర్వాత ఎవరన్నా కనబడతారూ ? మా తండాలో బెల్లందిన్నతర్వాత కనబడ్తే ఊరుకోరు' కళ్ళు పెద్దవి చేసి అన్నది.

'అయితే నువ్వుకూడా బెల్లం తినరాదూ? మీ భాయిలాగా' నవ్వుతూ అన్నాడు.

'ఛీ! అప్పుడేనా! మీకేం తెలియదే. బెల్లందింటే తొరగా పెళ్ళవుతుందన్నమాట! మా అనిమిభాయి పెళ్ళి తొరగా అవు

ద్దండి.....నిజంగా......నయిజాం వోళ్ళొచ్చి సమ్మందం కాయిం జేసుకున్నారుగా......మీకు తెలియదన్నమాట.'

హృదయకుహూరంలో మధుర భావాలు, నిరాశా నిశ్వాసానికి లోనుకాగా అంతిమ క్షణంలో ఆక్రందించిన అనుభూతుల గావుకేకలాగా, లోక సౌందర్యాన్ని చూడాలనే ఆకాంక్షతో తహతహలాడే వృక్షాగ్రభాగపు నవపల్లవం భీషణ ఝంఝూమారుతానికి చలిస్తూ చేసే నిశ్శబ్ద నీరసపు సవ్వడిలాగా, ఆరాధ్యదైవానికి హృదయపూర్వకంగా తీసుకొని వెళ్తున్నప్పుడు జారిపోయిన పూజాద్రవ్యాలను చూసి భక్తుని మనస్సులోని నిట్టూర్పులాగా 'ఆఁ' అన్నాడు రత్నబాబు.

కాని చంద్రికి రత్నబాబు హృదయంలోని తీవ్రమయిన ఆవేదన అర్థంకాలేదు. చిత్రంగా మాత్రం రత్నబాబును చూసి వెళ్ళబోయింది.

'చంద్రీ! ఒక మాట. మీ అక్కను సాయంత్రం వేప చెట్టు దగ్గరకు రమ్మన్నానని చెబుతావా?' దిగులుగా అన్నాడు.

'సరే' అంది చంద్రి.

జీవితంలో మొట్టమొదటిసారి ఎదురుదెబ్బతిన్న హృదయంతో యింటికి బయలుదేరాడు. దారిలో ఇద్దరు, ముగ్గురు యోగక్షేమాలు విచారించారు. ఉదాసీనంగా జవాబు యిచ్చాడు. భారంగా నడుస్తున్నాడు. దారిప్రక్క యిళ్ళలోని వయ్యారిభామల తియ్యని కంఠాలు శ్రుతి సవరించుకొన్నాయి రత్నబాబును చూసి. వారి మాటల్లో ఏదో అవహేళనాభావపు ఛాయ గోచరించింది. వారేదో రహస్యంగా మాట్లాడుకొని బిగ్గరగా నవ్వినట్లనిపించింది. రత్నబాబుకు వారి నవ్వులోని అంతరార్థం అర్థమైంది. అనిమితో కలసి వున్నప్పుడు గమనించి పరిహసించిన ఈడేరిన ఆడపిల్లలు! నిజంగా స్త్రీజాతి హృదయాలే ఈర్ష్యకు నిదానాలేమో !! అనిపించింది.

ఇంట్లోకి వెళ్ళాడు. ఎదురుగా పడకకుర్చీమీద కూర్చున్న తండ్రి కనిపించాడు. రత్నబాబును చూసిన కళ్ళల్లో ఏదో కాంతిరేఖ తళుక్కుమంది. వాత్సల్యపూరిత మయిన ఆర్ద్రనయనాల దృక్కులు రత్నబాబుహృదయాన్ని పరవశం చేశాయి. దగ్గరగావెళ్ళి సవినయంగా కుర్చీదగ్గర నుంచున్నాడు.

'కూర్చో బాబూ' అనగానే ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నాడు.

'పరీక్షలు బాగా రాశావుగదూ? అక్కడ అంతా క్షేమమేగా?' తల ఆడించాడు రత్నబాబు.

'ఊఁ....నీ కొక విషయాన్ని చెబుదామనుకొంటున్నా. నీకు వినడానికి యిప్పుడు అభ్యంతరం లేదుగా?' కన్నుల్లోకి చూశాడు.

'లేదు......చెప్పండి'

'అయితే జాగ్రత్తగా వినాలి. చూడూ! నీకు వయస్సు వచ్చింది. మాకు వయస్సు మళ్ళింది. నీ ముద్దు ముచ్చట చూడాలని అందరి తల్లిదండ్రుల్లాగా మాకూవుంది. అందరి తల్లిదండ్రుల్లాగా నీ భవిష్యత్తు ఉజ్జ్వలంగా వుండాలవి అనుకొంటున్నాము. కాబట్టే నీ వివాహం చేయాలని సంకల్పం. నువ్వు యిక్కడకు రాకముందే ఆ విషయాన్నిగురించి ఒక నిర్ణయానికి వచ్చాం. నీకది సుముఖంగా వుంటుందని మా ఆశ. అయితే పెండ్లివిషయంలో యువకుల్లోవుండే అభిప్రాయాలు నాకు తెలుసు. పరిసరాల ప్రభావం వల్ల, అభిరుచులవల్ల ఏవో ఆశలు, ఆశయాలు వుంటాయి; తప్పుకాదు. కానీ వాటి ప్రభావం జీవితంలో ఎంతవరకుంటుందో తెలివిగలవాడు ఆలోచించాలి. అనుకొన్నవన్నీ జీవితంలో జరగవనే సంగతి మరచిపోగూడదు. జీవితం సరళరేఖకాదు, తిన్నగా వెళ్ళడానికి. కథల పుస్తకంకాదు, మనసుకు నచ్చినదంతా చిత్రించడానికి. ఇది జీవితం. సుఖదుఃఖాల, ఆశానిరాశల కూడలి. అంతేకాదు బాబూ! వివాహం సాంఘిక బంధం. సంస్కారపు పూత తర్వాతనే. ఈ విషయాన్ని మనం కలలో కూడా మరచిపోగూడదు. కాబట్టి నీ ఉద్దేశం ఏమిటి?' అని రత్నబాబు కన్నుల్లోకి సాభిప్రాయంగా చూశాడు.

మృత్యువునకు, మనుగడకు నడుమ ఊగిసలాడే ప్రాణపు అసహాయ దశలాగా, భూమ్యాకాశాలమధ్య భయంతో చలించే జీవపు స్థితిలాగా రత్నబాబు హృదయంలో ''సంధిగ్ధత' ప్రళయ నాట్యం చేస్తున్నది. తండ్రిమాటను అనుసరించడానికి, అధిగమించడానికి మనస్సుకు శక్తి చాలడంలేదు. కాని ప్రస్తుత సందర్భం బలీయమైంది కాబట్టే — 'సరే—మీ....ఇష్టం' అన్నాడు. ఒత్తిడిపెట్టిన కాలపర్వతాల భారానికి హృదయం గీపెట్టిన అంగీకారపు గోల అది.

వీరయ్యకన్నులో సంతోషం కనబడింది. ప్రక్క నిలబడి వింటున్న శ్రీదేవమ్మ ఆనందబాష్పాలు తుడుచుకొన్నది.

'సరే......భోజనం చెయ్యి' అని వీరయ్య బయటకువెళ్ళాడు.

కాసేపటికి రత్నబాబుకు మానసిక స్పృహ వచ్చింది. తాను అనుకున్న దేమిటి? చేసిందేమిటి? ఇంత విపర్యయమా? ఎంతోకాలంనుండి భావంపోసి పెంచుకొన్న ఆశాలత ఇంకొకరి అభిప్రాయానికి దాసోహమన్నదే? ఇంత పిరికిమనస్సా నాది? తండ్రి లౌకిక వాక్ప్రవాహంలో తలమునకలైన తుంగ మొక్కా తన మనసు? ఎండమావుల స్వరూపాన్ని ఆరాధించే అంధహృదయమా తనది? ఏమిటి మనస్సులోని మనస్సు యొక్క చంచలభావం? అనుకొన్నాడు.....తండ్రి మాటల్లోని గూఢార్థం అనిమీ సాంగత్యాన్ని ఎలా నిషేధించిందో అర్థమైంది. 'జీవితంలో అనుకొన్నవన్నీ జరగవనే సంగతి మరచిపోగూడదు' అని తండ్రి చెప్పిన మాటల్లోని సూచన కొంతవరకు పిరికిమందు కలిపింది హృదయంలో.

ఎంగిలిపడ్డాడు. మనసులో నిస్పృహ నిండుకొన్నది. కొడుకు అభిప్రాయాలు పూర్తిగా తెలిసిన శ్రీదేవమ్మ మాట్లాడలేదు. రత్నబాబు గదిలోకి వెళ్ళి మంచంమీద పడుకొని ఆలోచిస్తూ నిద్రపోయాడు. నిద్రనుండి లేచేటప్పటికి ఒంటిగంటన్నర అయింది. చొక్కా తడిసిపోయినట్లనిపించింది. అద్దంలో ముఖంపై కన్నీటిచారికలు కనబడ్డాయి. ముఖం కడుక్కొని బట్టలు మార్చుకొని కాఫీ తాగి బయటకు వచ్చాడు. మనస్సులాగే శరీరం కూడా ఒకేచోట వుండడానికి ఒప్పుకోడంలేదు. అనిమీ యింటిమీదుగా వెళ్ళి వంతెనమీద కూర్చున్నాడు. ఇంటివైపు దృష్టి సారించాడు. కానీ మనసులో ఏదో ఆశంక. కొన్ని నిముషాలు అయిన తర్వాత పూర్వ సాంకేతిక స్థలమైన వేపచెట్టుదగ్గరకు వెళ్ళాడు—

ఎండిపోయిన తీగలు, కృశించిన తుంగభద్రకాలువ, కళమాసిన వేపచెట్లూ, సాగబుమాసిన యాత గుబుర్లు, నిరాశగా తలలూపుతున్న తుంగమొక్కల దృశ్యం—నిరాశా పూరిత హృదయంలాగా, పసిపిల్లవాడు వ్రాసిన చిత్తరువులాగా, భవిష్యద్భావాన్ని ప్రతిబింబింపజేసే దర్పణంలా వుంది.

రత్నబాబుకన్నుల్లో నీళ్ళు చిప్పిలినాయి. గుండె బరువైంది. అనిమి రాకకోసం హృదయం ఆరాటపడుతున్నది. క్షణాలు ప్రాణం పోయేవాని గుండెలోని స్పందనాల్లాగా జరుగుతున్నాయి. సుదూరంగా ఏదో ఆకారం వస్తున్నట్లు అనిపించింది. గుండె ధైర్యాన్ని పుంజుకుంది. అంతలో 'రత్నబాబూ!' అని కేక వినిపించింది. రత్నబాబు ఉలిక్కిపడ్డాడు. తుంగభద్ర కాలువ అవతలిగట్టునుండి పిలచిన యువతికంఠం అది. రత్నబాబు నిశ్చేష్టుడైపోయాడు. పిలచినామె ఎవరు? నేనామెకు ఎట్లా తెలుసు? అనే ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరైపోయాడు.

అవతలిగట్టున యువతి కిలకిలమని నవ్వింది, రత్నబాబు అవస్థ అర్థంచేసుకున్నాననే ఉద్దేశ్యం కనబరుస్తూ. రత్నబాబు ఆమెను పరీక్షగా చూశాడు. వ్యక్తమౌతున్న ఆమె రూపం, మనసులోని భావానికి గోచరం కాలేదు. పరీక్షలో ప్రశ్న తప్పురాసిన విద్యార్థి మనసులోని భావం రత్నబాబు ముఖంలో స్పష్టమైంది.

'నేను రత్నబాబు! రాజేశ్వరిని. మరచిపోయావా? మా మామ్మగారి యింటిదగ్గరనుంచి వస్తున్నా. నాతో మా నాన్న కూడా వస్తూ తోటలోకి వెళ్ళాడు. ఊరునుండి ఎప్పుడు వచ్చావు? అసలు ఏంజేస్తున్నా విక్కడ? అబ్బో! నన్ను మరిచిపోయావే! నువ్వు ఎక్కడున్నా గుర్తుపట్టగలరు. కొంపదీసి లంబాడికోసం కాదుకదా ఈ మకాం?' కంఠంలో అసహ్యత ధ్వనించింది. ఆమెమాటల్లో అధికారపూర్వపు హెూదా కన్పించింది.

రత్నబాబు చెంపమీద చెళ్ళుమని ఎవరో కొట్టినట్లనిపించింది. ఏమీ మాట్లాడలేదు.

అంతలో తులసి రత్నబాబుదగ్గరగా వచ్చింది. అనిమి రాకుండా ఆ చిన్నపిల్ల ఎందుకు వచ్చిందా అనే సంశయం కలిగింది రత్నబాబుకు. వగర్చుతూవచ్చిన తులసి 'చుట్టాలొచ్చారు. అందుకని మా భాయి రాలేనని సెప్పమంది. ఏడుస్తున్నది కూడా. రేపు తప్పక యిక్కడికే వస్తానంది. ఏమీ అనుకోవద్దని సెప్పమంది' అని బుడి బుడిగా చెప్పింది.

రత్నబాబును అర్థంగాని అయోమయం కమ్ముకొన్నది. లంబాడి పిల్లవచ్చి ఏవో మాటలు చెప్పగా అసహ్యంగా ముఖం పెట్టి, రాజేశ్వరి బాధగా వెళ్ళిపోయింది. రాజేశ్వరి వెళ్ళినదిక్కే చూస్తూ నిరామయంగా, నిస్తబ్దంగా, శిలాప్రతిమలాగా, ప్రజ్వరిల్లని అగ్నిపర్వతంలాగా, చకితుడై నిల్చుండిపోయాడు. రత్నబాబు ముఖం చూస్తూ నిలబడ్డ తులసికి జేబులోని అణా బిళ్ళ యిచ్చాడు. నెమ్మదిగా బయలుదేరింది తులసి.

చుట్టు కలయజూచాడు. పరిహసించింది ప్రకృతి. విరిగిపోయింది మనసు. తరిగిపోయింది తలపు. అక్కడేమి తోచలేదు రత్నబాబుకు.

ఒక ప్రత్యేకవ్యక్తితో ప్రత్యేక వాతావరణంలో హృదయపూర్వకంగా మాట్లాడుకొన్న తర్వాత అదే ప్రదేశంలో ఆ వ్యక్తిలేని లోపంలోని బాధ హృదయానికే తెలుసు! అయినా ఆ ప్రదేశాన్ని చూస్తే ఏదో కృత్రిమ సంతృప్తి. అందుకని రత్నబాబు అక్కడనుండి సంగమేశ్వరుని దేవాలయం దగ్గరకు బయలుదేరాడు. అతని మనసులో పుంఖాను పుంఖాలుగా ఆలోచనలతెరలు.......

—జీవితంలో తాను సాధించదలచుకొన్నదేమిటి? జరగబోయేదేమిటి? తన ప్రస్తుత జీవితాన్ని నెమరువేసుకొంటే నిర్వర్తించిన ఘనకార్యం ఏమైనావుందా? అయినా ఘనకార్యం చేయడమే జీవితలక్ష్యమా? అయితే ఎంతమంది జీవితాలు లక్ష్యసాధనలో ఫలితాన్ని పొందాయి? కానీ ఎవరికివారే యిలా అనుకొంటే ప్రపంచంలో జరిగే చిత్రమైన విషయాల సంగతో? లక్ష్యాలకోసమే జీవితం అయితే లోకం యింకొక విధంగా వుండదూ?.....మరి లక్ష్యం అనుకొన్న దానిలోనే స్వార్థం వున్నదిగా? అది ఉన్నతం ఎలా అవుతుంది?.....పోనీ తన యత్నమంతా గతజలసేతుబంధనం అయితే దాన్నిగురించి ఆలోచించడం అసంగతంకదా? — అయినా ఎలా సాధ్యం. గాయం మానినా చిహ్నం మాసిపోతుందా?

మెదడులో ముల్లులాగా బాధిస్తున్న సందిగ్ధ విషయాల భారంతో సంగమేశ్వరుని దేవాలయం దగ్గరకు వచ్చాడు. అదే గలగల నురుగుల పరుగులతో మనసులోని క్లిష్టవిషయంలాగా మందంగా ప్రవహిస్తున్న యేరు! అవే చల్లని గాలిలో మంతనాలుసాగిస్తున్న తెల్లనిపూలతో రెల్లు దుబ్బులు. అలనాటి ఈదృశ్యం గుండెలో గాలంవేసి అనుభూతుల స్మృతుల్ని లాగింది. మనసుకు నిస్పృహ వచ్చింది. ఆలోచనలకుశోషవచ్చింది.

సంగమేశ్వరుని దర్శనం చేసుకొని గర్భ గుడి యివతల జమ్మిచెట్టుక్రింద అరుగుమీద కొంచెంసేపు కూర్చున్నాడు. జరిగిపోయిన మహాశివరాత్రినాటి విషయాలు మనసులోనికి వచ్చాయి. ఆనాడు—అనిమీ తాను సంగమేశ్వరునికి ఆశాభరిత హృదయాలతో నమస్కరించడం — మనసులో ఏ భవిష్యత్తులోనో జరగబోయే మధురోద్దేశ్యాలు సక్రమంగా జరగాలని సంగమేశ్వరునికి నివేదించడం — అదే జమ్మిచెట్టుక్రింద హరిశ్చంద్రనాటకం చూడ్డం — లేతహృదయాల్లో ఏవేవో వికసించని భావాల మొగ్గలు కదలడం — అంతా కళ్ళకు కట్టినట్లు అనిపించింది. అక్కడ వుండ బుద్ధికాలేదు రత్నబాబుకు. మరల స్వామికి సజలనయనాలతో నమస్కరించి మూగపడిన హృదయవేదనతో దేవాలయ ప్రాంగణం దాటి బయటకువచ్చాడు.

చుట్టు కలయజూచాడు. పురోహితుని జోస్యం కల్లకాగా ఫకాలుమని నవ్విన సత్రమాట్లులాగా సంగమేశ్వర దేవాలయాన్ని చూసి దక్షిణదిశనవున్న పర్వతం నవ్వినట్లనిపించింది. మనసులో ఎపుడో గుబాళించిన స్మృతులు సువాసన ఆకళింతకు వచ్చింది. నడక సాగించాడు. మనసంతా కరిగిపోతున్నట్లనిపించింది.

నడుస్తున్న రత్నబాబుకు 'ఒరేయ్! బాబు. ఇటు రారా. ఏమిట్రా పరధ్యానం బుద్ధునిలాగా' అని పరిచయమైన కంఠం వినిపించింది. వెనక్కితిరిగి చూశాడు. గుట్టమీద కూర్చొని రాళ్ళు విసరుతున్న రత్నబాబు ఈడు యువకుడు కన్పించాడు. రత్నబాబుకు ప్రాణం లేచివచ్చినట్లనిపించింది.

"ఒరే! నువ్వుట్రా పురుషోత్తం! ఎప్పుడు రావడం? అబ్బ చాలా....రోజులైందిరా నిన్ను చూసి......" అని నిట్టూర్పు వదులుతూ ప్రక్కనే కూర్చున్నాడు.

'నిన్న ప్రొద్దున్న వచ్చానురా. అయినా ఈ పరిస్థితిలో నేను జ్ఞాపకం వుంటాననే నమ్మకం నాకు లేదురా నాయనా.... నా ఊహ నిజమేనంటావా?'

'ఊహ అన్నిసమయాల్లో నిజంకాదనే సంగతి నీకు తెలుసా?'

'కావచ్చు; కాని యిప్పుడు మన గురి తప్పడానికి వీలు లేదనుకొంటాను.'

"అందుకనేగా బి. ఏ. వరకు నీ గురి తప్పలేదు. ఇదేం చిత్రం కాదుగా?'

'అవుననుకో నా గురి నీ గురంత సునిశితమైందికాదురా మరి. అదే ట్రాజెడీ!'

'గాజుపూస నీ దృష్టికి మణిపూస అయిందే! నా ప్రత్యే కతను గురించి నాకే ఆశ్చర్యంగా వుంది సుమా?'

'దంతపుగాజులు నీ దృష్టికి మణిపూసలుకాలా? నాకు అట్లా అనిపించడంలో అతిశయోక్తి ఏమిటో?'

రత్నబాబు దాదాపు చకితుడైపోయాడు. పురుషోత్తం తన చిన్ననాటి స్నేహితుడు. తనను మర్మగర్భితంగా సూటి పోటి మాటలతో బాధించడం మనస్తాపాన్ని కల్గించింది. అసలు విషయాన్ని తానే చెబుదామనుకొన్నాడు కాని అతనికి సహృద యత వుందోలేదోనని ఎందుకో ఈ మాటలవల్ల అనుమానం ఏర్ప డింది. కొంచెంసేపు మౌనం వహించాడు.

'నీకూ్కడా తెలుసురా?' కంఠంలో జీర ధ్వనించింది.

పురుషోత్తం కొంటెగా నవ్వాడు. 'ఏమిట్రా అది' ఏమిటో తెలుసనేభావం ధ్వనించింది.

'దంతపుగాజులు ధరించిన దరిద్రురాలు' కత్తిపదును లాంటి సున్నితపు మాట వచ్చింది.

పురుషోత్తం ఒక్కసారిగా పర్వతశిఖరంమీదనుండి భూమిమీదకు దొర్లించబడినట్లు కలతపడ్డాడు. కాని మనసు లోని బింకాన్ని కనబడనీయలేదు.

'అదికాదురా.........అసలు.......'

'అదే అవునురా.....ఏం.....నేను లంబాడిపిల్లను ప్రేమించ కూడదా?'

'ఎందుకు ప్రేమించకూడదూ? ఇంకా ఎవరూ దొరకలా ఈ భూప్రపంచంలో.'

'ఏం......లంబాడీపిల్ల చేదా?'

'చేదుకాదు.......విషం.....తెలుసా?'

'ప్రాణాపాయంలో విషం ఔషధం.....తెలుసా ?'

'ఇప్పుడు ప్రాణాపాయం ఏమిటి స్వామి?'

'మనసుకు నచ్చనిదాన్ని నెత్తిమీద రుద్దించుకొని అఘో రించడం ప్రాణాపాయానికి పర్యాయపదంకాదా?'

'అప్పుడు చూచుకోవచ్చులే. కొంప మునిగిపోదుగా? మేమందరం లేమూ?'

'తమాషా చూడ్డానికా"

'నీకు సహాయం చేయడం తమాషా అయితే, అదే!'

'నేను జీవితంలో పరిస్థితులకు లొంగి, సంఘానికి దాసో హమని, మనసుకు నచ్చనిదాన్ని అమృతంగా ఆస్వాదిస్తున్న పుడు, కీలుబొమ్మలాగా ప్రవర్తిస్తున్నపుడు చేస్తారా సహాయం? నా కనీసపుకోర్కెను సాధించుకోడానికి నేను లోకానికి 'దిష్టి బొమ్మ'ను ఎందుకు కావాలి?'

'నీ మనస్సులోని కోర్కె చెల్లించుకోవాలని పదిమంది మనస్సుల్లో గాయాన్ని కలుగజేస్తావా బాబూ'

'రేపు ఆ పదిమంది నా కన్నీటిలో భాగస్వాములౌతారా ? నా హృదయబాధలో దాయాదులవుతారా ? లేకపోతే నా సంతోషంలో పాల్గొంటారా? నా విషాదంలో ఒక్క కన్నీటి బొట్టు ఎరువిస్తారా? చెప్పగలవా?'

'ఎవరైనా సలహా లిస్తారుకాని నెరవేరేదాకా తోడ్పడ తారా ఏమిట్రా'

'అంత చేవవుంటేనే పరిధిలోకి దూకాలి. లేకపోతే ఊరు కోవాలి.'

'అయితే రత్నబాబు ! జీవితచిత్రంలో మనమనుకొన్న దృశ్యాలు కనబడవన్నమాట మరచిపోవద్దు. నీ మనసు కొలతతో లోకం మనసును కొలవబోకు. అందుకని నీకు ఆదర్శాలు, సంస్కరణలు అవసరంలేదనికాదు. అసలు ఆదర్శాలు, సంస్క రణలు వ్యష్టిగాగాక, సమష్టిగా పరిష్కరించాలనే సంగతి జ్ఞాపకం వుంచుకోవాలి. అట్లా కాకపోతే పూజాపుష్పమైనా నిషేధమై పోతుందనే విషయం చెప్పడం అనవసరం. ఇంకొక సంగతి. అనుకొన్న వస్తువు అలభ్యమైతే, అలభ్యమైన వస్తువుమీద వుండే ఆప్యాయతను దానికి బదులుగా వచ్చిన వస్తువుమీద కేం ద్రీకరించుకోవాలి. అదే జీవిత రహస్యం. దీన్ని గనక జీవితంలో అమలుపెట్టగలిగితే సమస్యలే రావు. అవునంటావా?'

'పురుషోత్తం! స్వప్నాల్ని జీవితం అనుకో అనడం ఎంత అసమంజసమో నువ్వు చెప్పిన మాటలు అంతే. ఇటువంటి వాదంతో అన్నీ పరిష్కారంకావు. నువ్వింత సహృదయత ఉన్న వాడవని అనుకొన్నట్లయితే ఈ విషయాన్ని ప్రస్తావించే వాడినేకాదు. దారి చెప్పమంటే దారి తప్పిస్తావే పురుషోత్తం? ఇదేనా నీబోటివాడు చేయవలసిన విధానం?'

'ఈ ప్రేమలు.....రాద్ధాంతాలు.......సంస్కరణలు..... వాటి అర్థం ఈనాటికి దాదాపు పాతబడిపోయాయి. అయినా గురిలేని పనులు చేయడంవల్ల తర్వాత వచ్చే విషమపరిస్థితులకు అనేకులు అపరాధుల్ని బాధ్యులుగా చేయవలసివస్తుంది. అందు కని ఆలోచించి చెప్పాను నేను. నీకు అయిష్టమైంది అది. అంతే కదూ?'

'అప్పుడూ నాదే తప్పుకాదు. సామాన్య ప్రాథమిక హక్కు ప్రతి వ్యక్తి ప్రేమించడం; దానికి అవరోధాలు పాషాణహృద యుల కఠోర నిర్ణయాలు, నిబంధనలు. అధికార రథ చక్రాలక్రింద అణగారిన అల్పహృదయాలు మాబోటి వాళ్ళవి. తర్వాత ఏమాట చెప్పబడినా పై దానికి అనుబంధాలే' రత్న బాబు ప్రతిమాటలో అంతులేని ఆవేదన స్పష్టమైంది.

'సరే రత్నబాబు! నీతో వాదించడంవల్ల ఒకే ప్రయోజ నాన్ని తెలుసుకోగలిగాను. నీ మనస్సును గాయపర్చడం నా కిష్టంలేదు. నువ్వు చెప్పిన విషయం కూడా సమంజసంకాదని

నేననను. కాబట్టి "లంబాడి పిల్ల'ను నువ్వు.....చేసుకో. ఆమెకు సంబంధం నిశ్చయం అయిందని విన్నాను. అవసరం అయితే ఇక్కడనుంచి వెళ్ళిపో. కావలిస్తే నా సహాయం నీ నాకెంతైౖ వుంటుంది అన్నాడు.

ఆ మాటలు వినగానే 'పురుషోత్తం' అని రత్నబాబు పురుషోత్తాన్ని కౌగలించుకొన్నాడు. పురుషోత్తం భుజంమీద ఆనందాశ్రువులస్పర్శ తగిలింది. రెండు హృదయాల భావాలు ఒకేచోట సంగమించుకొన్నాయి. ఆనంద నాట్యం చేసుకొన్నాయి.

'పురుషోత్తం! నీ హృదయం ఇంత విశాలమని తెలుసు కోలేకపోయాను. నీ ప్రోత్సాహానికి, ప్రోద్బలానికి నేనెంత కృత జ్ఞుడనై వుండాలో అర్థం కావడంలేదు. ఈ విషయాన్ని వాళ్ళకు తెలియజేసి మళ్ళీ కలుసుకొంటాను' అని మనుస్ఫూర్తిగా చేతులు పట్టుకొని చకచకా నడిచి వెళ్ళాడు. పురుషోత్తం కన్నులు బాష్పాకులలాయినాయి.

తరంగాలు లేని నిస్తబ్ధ సముద్రంలాగా ఆలోచనలు లేని హృదయం ప్రశాంతంగా వున్నది. మనసులాగే ప్రకృతి ప్రశాంతంగావుంది. రత్నబాబు చుట్టు కలయజూచాడు. యౌవ నంలోవున్న స్త్రీ సుతారంగా నడుస్తున్నపుడు వక్షోజపు చిరు కదలికలోని సోయగం సాయంకాలం కదులుతున్న వేప కొమ్మలో వుంది. ముగ్ధ స్త్రీల అధరాల ఎరుపురంగు పశ్చిమ దిశన మబ్బు తునుకల్లోవుంది. ఎవరో దేవతలు రంగు రంగుల వస్త్రాలు ఆరవేసుకొన్నట్లుగావుంది ఆకాశం. అనేక మయిన ఆకృతులు సర్పాలుగా, మనుష్యులుగా, జంతువులుగా ఆకాశకుడ్యం మీద కనబడుతున్నాయి. రత్నాబాబు నడుస్తున్నాడు. మనస్సు ఒకేచోట కేంద్రీకరింపబడింది.

ఇంకొక ఫర్లాంగు నడువవలసి వుంది. ఆకాశంలో మనుష్య పాదాన్ని సర్పం కాటువేయుగా ఆ ఆకారం కరిగిపోయింది. ఈ దృశ్యం చూసిన రత్నబాబు 'చిత్రం!' అని నవ్వుకొన్నాడు.

గుండ్రని సీసాలో రక్తాన్ని నింపుతున్నట్లుగా అస్త మిస్తున్న సూర్యునిలో అరుణిమగోచరిస్తున్నది. సీసాలోనుండి యెక్కువైన రక్తం పరిసరాల్ని చిందిపోయినట్లుగా పశ్చిమ దిశాభాగాన్ని ఎరుపు రంగు పులిమింది. ఈ వింతను గమనిస్తున్న గుబురుతాటితోపుల ముఖాల్లో సూర్యుని పోకతో చీకటి అలము కొన్నది.

ఒంటరిపక్షి రోదిస్తూ ఎగురుతున్నది. తోటల్లోని గాలి రొదచేస్తున్నది. రత్నబాబు మనసు యెందుకో వణికింది.

వంతెన దగ్గరకు వచ్చాడు.

లంబాడీగుడిసెల్లో ఆక్రందనలు వినబడుతున్నాయి. హృదయవిదారకమైన ఆ యేడ్పు ధ్వనులు విన్న తర్వాత అక్కడ వుండడానికి మనస్కరించలేదు. వెళ్ళాడు. రెండు ఇళ్ళు దాటాడు. చాపమీద మనిషి, చుట్టు జనం. మంత్రాలు పసరులు వేస్తు న్నారు. మనిషి దగ్గరగా వెళ్ళాడు. నోట్లో నురుగు. కన్నులు అనంతంలోకి చూస్తున్నాయి; చలించని శిలాప్రతిమలా రత్న బాబుగుండె జారిపోయింది. అనుభూతులు ఆవలించాయి. జీవితసర్వస్వం కలలాగా చెదరిపోయింది. ఊహ, ఆలోచన, చైతన్యం, శక్తి స్తంభించిపోయాయి. ఉద్దేశాలు, లక్ష్యాలు దుమ్ముకొట్టుకపోయాయి. ఆశలు దుమ్ముకొట్టుకపోయాయి.

'బ్రదకడం వృథా? ఎందుకు జీవించడం? జనం ముఖం ఎలా చూడ్డం?' అనుకొన్నాడు రత్నబాబు. ఉబికే ఉద్వేగాన్ని ఆపడానికి శక్తి లేకపోయింది. రైలుపట్టాలవైపుకు నడక సాగించాడు.

వంతెన దాటాడు. పాము నోట్లోని కప్ప దైన్యంగా అర చింది. రత్నబాబు విన్నాడు. 'బ్రదుకుమీద అల్ప జంతువుకు కూడా ఎంత ఆశ? క్షణంలో ప్రాణం పోయేటప్పుడుకూడా ప్రయోజనం లేని ఆర్తనాదం ఎందుకో?' అనుకొన్నాడు.

తోటదాటి పోబోతున్నాడు. ఒక జంగురుపిల్ల చెంగున రత్నబాబుముందునుండి దూకింది. రత్నబాబు భయంతో వెను కంజ వేశాడు. 'అసంకల్పప్రతీకారచర్యవల్ల దేహం ప్రాణా నికి జరుగబోయే ప్రమాదాన్ని పసిగట్టింది. స్వయంగా ప్రాణా నికి బ్రతకాలని ఎంత తీపి!' అనుకొన్నాడు.

వెంటనే రత్నబాబు మనస్సులో ఒక ఊహ తళుక్కు మంది—నేను చావను. పామునోట్లో కప్పకన్నా నా జీవితం ఉన్నతమైనదే. అనిమిలా మరణించాలని నా ఉద్దేశంకాదు. అనిమీ చనిపోయిందని నేను చస్తే వచ్చే ప్రయోజనం ఏముంది? మరణం జీవితానికి చరమాంకం! ప్రేమ, దాని వైఫల్యం మాత్రమే జీవితంకాదు. ప్రేమ జీవితంలో ఒక భాగం మాత్రమే. అయినా యిప్పుడు జరిగిన రెండు సంఘ టనలవల్ల చలించిన నా జీవనలాలసను నా చేతులార ఎందుకు త్రుంచుకోవాలి? నేను ఆమెకు అపచారం ఏవిధంగాను చేయలేదుగా? ప్రయోజనం లేకుండా ఎన్నో అంకాల జీవితాన్ని వమ్ము చేసు కోనా? కాబట్టి నేను చావను.......నా జీవనలాలసను త్రుంపు కోను— అని అనుకొని తెల్లవారుజామున ఇంటికి వెళ్ళాడు.

వారం రోజులు ఇంట్లోనుంచి బయటకు రాలేదు. రైలు పట్టాల ప్రక్క అనిమీ సమాధి వెలసింది. తర్వాత తులసి చెప్పింది: అనిమీ భాయి తన్ను అన్నిసంగతులు అడిగి ఏడుస్తూ ఉద్దేశపూర్వకంగా పాముతో కాటు వేయించుకొందని.

తమ విషయం అంతా అర్థం చేసుకుని తన ఉదయ కాల జీవితాన్ని అమాయకంగా బలిచేసిన వ్యక్తికి తానేంచేయ గలిగాడు? అనేదానికి రత్నబాబు పిచ్చిగా నవ్వుకునేవాడు. అప్పటి హృదయవేదన అలా అనిపించేది. గడచిన జీవితం అంతా కల, మధుర స్వప్నం, ఆకాశ చిత్రాలు.

తొమ్మిదిన్నర రైలుబండి కూసింది. రత్నబాబు ఉలిక్కిపడ్డాడు. చుట్టు కలయజూచాడు. చీకటి సామ్రాజ్యాన్ని నెలవంక పాలిస్తున్నది. కన్నీళ్ళు తుడుచుకొన్నాడు. బయలు దేరవలసిన సమయం సమీపించిందని మనస్సు మథనపడింది. అనుభూతుల మధురక్షణాల్ని స్మృతికి తెచ్చుకోడం ఇంకెన్ని సంవత్సరాలకో అనే వ్యాకులతతో, రాజేశ్వరి, పిల్లలు ఎదురు చూస్తారేమోనన్న ఆత్రంతో బట్టలు దులుపుకొని గబ గబా నడచిపోయాడు మానవుడు.

మానవప్రవృత్తిలోని ద్వంద్వవిషయలోలత్వాన్ని చూసి ప్రకృతి ఆశ్చర్యపడిందా అన్నట్లు నెలవంక తెలి మబ్బుల వలిపెంలో చిరునవ్వు దాచుకుంది నునుసిగ్గుతో!